క్లుప్తంగా

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు దీప్లానాయక్‌ను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్లుగా పని చేసి బదిలీపై చిల్లేపల్లి పాఠశాలకు వెళ్లిన రమావత్ దీప్లానాయక్‌ను మంగళవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యడవల్లి అనంతరెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, మాధురి, అంగన్‌వాడీ టీచర్ ప్రీతి, ఆయా అగ్నిషమ్మ, మేరమ్మ విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో స్టాఫ్ రిజిస్టర్లు, పిల్లల హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం మెనూ, పిల్లల వసతులను పరిశీలించారు. విద్యార్థులకు, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి విజయక్రాంతి, జేపీ మట్టయ్య, అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, ఉపాధ్యాయులు, ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



నాగేశ్వరరావు, అధ్యక్షుడు



గంగుల శ్రీదేవి, కార్యదర్శి

మునగాల : ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం) మునగాల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలో ఐఎన్‌టీయూసీ కోదాడ డివిజన్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల బాధ్యులు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమిడాల లింగయ్య సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా దొడ్డారపు నాగేశ్వరరావు(కలకోవ), ప్రధాన కార్యదర్శిగా గంగుల శ్రీదేవి (మాధవరం), ఉపాధ్యక్షుడిగా కూచిపూడి వీరయ్య (నారాయణగూడెం), సహాయ కార్యదర్శిగా వాసిమేకల సావిత్రి (రేపాల), కోశాధికారిగా నంద్యాల శ్రీదేవిలను ఎన్నుకున్నారు.

అధికార యంత్రాంగం అలసత్వం వీడాలి

మునగాల : వర్షాలకు మండల కేంద్రంలోని పలు వార్డులు అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతుండడంతో గ్రామ ప్రజలు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, అధికార యంత్రాంగం అలసత్వం వీడి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ కోరారు. మంగళవారం మునగాలలోని పలు వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను ఆయన పరిశీలించి మాట్లాడారు.

ఊరచెరువుకు హద్దులు ఏర్పాటు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల ఊర చెరువుకు మంగళవారం రెవెన్యూ, నీటి పారుదల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హద్దురాళ్లు పాతారు. ఈ చెరువు 111.26 ఎకరాలు కాగా చెరువు సమీపంలోని రైతులు ఆక్రమించి సాగు చేస్తుండగా స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల సర్వేయర్ గాయత్రి, నీటి పారుదల ఏఈ స తీష్‌లు చెరువు సర్వే నిర్వహించి రికార్డుల ప్రకా రం హద్దులు గుర్తించి రాళ్లు ఏర్పాటు చేశారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా తెలంగాణలోకి ఇసుక తరలిస్తున్న లారీని మంగళవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లారీలో కోదాడకు ఇసుక తరలిస్తుండగా చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ రామిశెట్టి సత్యనారాయణబాబుతో పాటు లారీ ఓనర్ తోట నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ

- మట్టపల్లి నుంచి హుజూర్‌నగర్ రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- రూ.80 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు



విస్తరించనున్న మట్టపల్లి - హుజూర్‌నగర్ రహదారి

మఠంపల్లి : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే మట్టపల్లి- హుజూర్‌నగర్ అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ పట్టింది. 24 కిలోమీటర్లు గల ఈ రహదారి విస్తరణకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించే రెండు రాష్ట్రాల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణంతో రద్దీ..

అయితే హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం వద్ద గల కృష్ణానదిపై నాన్ బీవోటీ పద్ధతిలో గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన రూ.50 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మించారు. దీంతో రెండు రాష్ట్రాలకు రాకపోకలు విపరీతంగా పెరిగి రహదారి రద్దీగా మారింది. దీనికి తోడు ఈ రహదారిపైనే నాగార్జున సిమెంట్స్, సాగర్ సిమెంట్స్, భవ్య సిమెంట్స్, మహా సిమెంట్స్ పరిశ్రమలు ఉండటంతో నిత్యం వేలాదిగా లారీలు, అతి భారీ వాహనాలు తిరుగుతున్నాయి. గుంటూరు జిల్లాలో గల పత్తి, మిర్చి మార్కెట్లకు తెలంగాణ నుంచి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ఎక్కువగా ఉన్నాయి.

10 మీటర్ల విస్తరణ..

మట్టపల్లి - హుజూర్‌నగర్ రహదారిని ప్రస్తుతం ఉన్న 7 మీటర్ల వెడల్పు నుంచి 10 మీటర్లకు విస్తరించనున్నారు. ఈ రహదారి విజయవాడ- హైదరాబాద్ 9వ జాతీయ రహదారిపై గల కోదాడ నుంచి హుజూర్‌నగర్, మఠంపల్లి, మట్టపల్లి ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా తంగెడ గ్రామం వద్ద కలుస్తుంది. దీని మూలంగా తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జిల్లాలకు వెళ్లే గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లా ప్రయాణికులు ఈ రహదారిపై నుంచే నిత్యం ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం రహదారి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వ్యాపార, వాణిజ్య సంబంధాలు మరింత బలపడతాయి



అంతర్రాష్ట్ర రహదారి విస్తరణతో రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మరింత బలపడతాయి. వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయి.

– భూక్యా మంజీనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మఠంపల్లి

ఇబ్బందులు తొలగుతాయి



మట్టపల్లి- హుజూర్‌నగర్ రోడ్డు వెడల్పుతో గుంటూరు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. నిత్యం వేలాదిగా తిరిగే లారీల వల్ల రద్దీ కూడా తగ్గుతుంది.

– షేక్ జహంగీర్, చౌటపల్లి

కల నెరవేరనుంది



రహదారి విస్తరణతో దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న రెండు రాష్ట్రాల వాహనదారుల కల నెరవేరనుంది. రాత్రి సమయాల్లో లారీలు, వాహనాలు రద్దీతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుంది.

– బి.హనుమానాయక్, పాతదొనబండతండా

విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడాలి



విద్యార్థులకు ప్రాజెక్ట్ నోట్ పుస్తకాలు అందజేస్తున్న బండారు కవిత

కోదాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించి పలువురికి ఆదర్శంగా నిలవాలని, పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని సాధించేందుకు కష్టపడాలని సర్వేజనా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్ పర్సన్ బండారు కవితాఅమరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రాజెక్ట్ నోట్ పుస్తకాలను అందజేసి మాట్లాడారు. ఎంఈఓ సలీం షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అమరేందర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ ఎంఎల్ఎస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి



సభ్యత్వాల నమోదులో పాల్గొన్న ఎస్టీయూటీఎస్ నాయకులు

గరిడేపల్లి : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గరిడేపల్లి మండలంలోని తాళ్లమల్కాపురం యూపీఎస్‌లో ఎస్టీయూ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నెలనెలా విధిగా ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులను బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు కామన్ సీనియారిటీ ప్రకారం వెంటనే నింపాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, క్లబ్ నేరేడుచర్ల అధ్యక్షుడు జిలకర రామస్వామి, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, సభ్యులు చిత్రం విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి శ్రీను, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతలలో 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం రెండు యూనిట్ల ద్వారా 6వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ విద్యుత్‌ను తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు. ఎగువ నుంచి వరద లేకపోవడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లు అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే.

రిటైర్డ్ హెచ్‌ఈఓ రామచంద్రరావు మృతి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఆరోగ్య విస్తరణాధికారి (హెచ్‌ఈఓ) ముటుకుల రామచంద్రరావు మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, పంచాయతీ సెక్రటరీ గిరిజాకుమారి, ధర్మవరపు శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేరేడుచర్ల : ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిని నాగిని తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 47 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి 200 రకాల వైద్య పరీక్షలు చేశారు. కొన్ని శాంపిల్స్‌ను సూర్యాపేటలోని టెస్ట్ చేసే రక్తన మూనాల హబ్‌కు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆరోగ్య సమస్యలను బట్టి మందులు అందించినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

గోపాలపురంలో నీటి కొరత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గత వారం రోజులుగా తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. తెలిపారు. కూలీ పనులకు వెళ్లి వచ్చి సాయంత్రం వేళ తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గత కొద్ది రోజులుగా విష జ్వరాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండటంతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రామంలో చేపడుతున్న ఫీవర్ సర్వేను మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్ పరిశీలించారు. దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులపై సీపీఐ ఖండన

నేరేడుచర్ల : బంగ్లాదేశ్‌లో హిందువులతో పాటు మైనార్టీలపై జరుగుతున్న దాడులను సీపీఐ ఖండిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మండల కేంద్రంలో సీపీఐ పాలకీడు మండల కార్యదర్శి ముక్క జానయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీనుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

బాల్య మిత్రుని కుటుంబానికి బాసటగా..



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మోతె : మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మంద ఉపేందర్ నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఉపేందర్‌తో పాటు 2006లో పదవ తరగతి కలిసి చదువుకున్న స్నేహితులు అతని పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు మంగళవారం రూ.62 వేల ఆర్థికసాయం అందజేసి బాసటగా నిలిచారు. అండగా ఉంటామని భరోసా కల్పించి ధైర్యం చెప్పారు.

ఆర్థికసాయం అందజేత

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చిలక జానయ్య ఇటీవల మృతి చెందారు. మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటికం ఆశరమేష్ పరామర్శించి రూ.5 వేలు, 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : శ్రావణ మంగళవారం సందర్భంగా చిలుకూరు మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజారి వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో చిలుకూరు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు -సరస్వతి కుటుంబసభ్యుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శత నామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మణ్‌రావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ఫీవర్ సర్వే

సాక్షి ఎఫెక్ట్..



ఆకుపాములలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని మంగళవారం సాక్షి దినపత్రికలో 'విజృంభిస్తున్న విషజ్వరాలు' అనే శీర్షికన వచ్చిన కథనానికి వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి స్పందించారు. మంగళవారం గ్రామంలో ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పి.నాగరాజు మాట్లాడుతూ.. గ్రామంలో 670 ఇళ్లలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్యసిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సర్వేలో డెంగీ జ్వరాలు నమోదు కాలేదని, 12 మంది సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్.. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.రవీందర్, దివ్యలతో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపిఓ దారా శ్రీనివాస్, ఎస్ఎంలు కవిత, శ్రీదేవి, ముకుందాపురం , నర్సింహపురం గ్రామపంచాయితీల కార్యదర్శులు రాజేష్, వెంకటేశ్వర్లు ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు.

మునగాలలో..



మునగాలలో జ్వరపీడితులకు మందులు అందజేస్తున్న అధికారులు

మునగాల : మండల కేంద్రంలోని పలు వార్డుల్లో శుక్రవారం వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.రవీందర్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'మా వాటా మాకే' పుస్తకం ఆవిష్కరణ



కోదాడరూరల్ : బాలుర ఉన్నత పాఠశాలలో పుస్తకం ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు



కోదాడరూరల్ : కోర్టు ఆవరణలో పుస్తకం ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కోదాడరూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించాలని, బీసీ కులగణన చేపట్టాలనే పలు అంశాలపై తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు, ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' అనే పుస్తకాన్ని మంగళవారం కోదాడ పట్టణంలోని కోర్టు, బాలుర ఉన్నత పాఠశాలతో పాటు పలు చోట్ల బీసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్యక్రమంలో బీసీ నాయకులు డి.మార్కేండయ, బడుగుల సైదులు, పాండురంగాచారి, చిన్నప్ప, జానకిరాం, గట్ల నర్సింహారావు, ఉయ్యాల నర్సయ్య, నాగేశ్వరరావు, బీమయ్య, మురళి, నయీం, బాగ్దాద్ ఉన్నారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి



నడిగూడెంలో..

నడిగూడెం : చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ కవి, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ రచించిన 'మా వాటా మాకే' అనే పుస్తకాన్ని మంగళవారం నడిగూడెం మండల కేంద్రంతో పాటు సిరిపురం, బృందావనపురం గ్రామాల్లో పలువురు నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీ.ఖలీల్ అహ్మద్, అనంతుల ఆంజనేయులు, వట్టికూటి చలపతి, చారాల వెంకటాచారి, కస్తూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



విద్యార్థులకు టైలు, బెల్ట్‌లు అందజేస్తున్న దాతలు

చిలుకూరు : మండలంలోని బేతవోలులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు మంగళవారం టై, బెల్ట్‌లు, బూట్లు అందజేశారు. గ్రా మానికి చెందిన వనపర్తి రామారావు, వీరస్వామిలు రూ. 20 వేలు విలువ గల బూట్లు, ముసుకుల వీరా రెడ్డి రూ.10 వేలు విలువ గల ఐడీ కార్డులు, సాయిలీ నవీన్ రూ. 10వేలు విలువ గల టై, బెల్టులతో పాటు బూట్లు అందజేశారు. రణబోతు అమర్‌నాథ్‌రెడ్డి రూ.7500 విలువ బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు గురవయ్య, మాజీ సర్పంచ్ చంద్రకళనాగయ్య, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం, మాంగల్యధారణను పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. శ్రీ ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేరేడుచర్ల : పాస్టర్ ఫెలోషిప్ నేరేడుచర్ల మండల కార్యవర్గాన్ని మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికై న రెడపంగ దానియేలును బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపోలు ఫిలిప్, సీనియర్ పాస్టర్లు నతానియేలు, గుడిమాటి సుధాకర్, పోలగాని రాంబాబుగౌడ్, శ్యామ్, మాతంగి పీటర్, ధర్మయ్య, ఏలిషమ్మ, ఆదాము, పాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడరూరల్ : కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలో వయనాడ్ వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జుట్టుకొండ బసవ య్య, దేవరం వెంకటరెడ్డి, ముత్యాలు, సైదా, దాస రి శ్రీను, వీరాంజనేయులు, శ్రీను, ప్రసాద్ ఉన్నారు.